# పలుకే బంగారమా!



కె. రామలక్ష్మి

జగన్నాథం మేష్టారు పిల్లలపాలిటి పిడుగేగాని పెళ్ళాంపాలిటి ప్రియుడే (నాకు తెలిసినంతవరకు!) స్కూల్లో పిల్లలమీద విసుగూ కోపం ఎంత ఎక్కువో అంతకంత శాంతింగానూ ఉంటారింట్లో. చిన్నప్పటి నుంచి చనువు ఉండడంతో నాకాయన దగ్గిర భయం పోయిందిగాని, ఇప్పటికీ క్లాసులో నించోపెట్టి 'సత్తికి కళ్ళెన్ని?' అని అడిగితే చప్పానన్నమాటే!

అలాంటి మేష్టారొచ్చి 'రావుడూ చాలా గమ్మత్తు జరిగిందోయ్' అంటే మరి కుతూహలంగా ఉండదూ? 'మా ఆవిడ చాలా గమ్మత్తుగా తయారైంది. అదేమిటో దాన్నిబట్టి అర్థం చేసుకునే వాణ్ణి ఈ ధోరణికీ తలాతోకా దొరకడం లేదు' అన్నారు. ఏమైందిట?... రోజూ లాగే సాయంత్రం కూర్చుని రేడియో ఇరుసు తిప్పుతున్నారట (వచ్చిన స్టేషన్ల మీద అసలు గౌరవం ఉండదు కొందరికి, తెగతిప్పి బర్ బర్ మనిపించి ఎదుటివాళ్ళ ప్రాణాలు తోడుతారు—(మేష్టారిది బి.బి.సి. జబ్బు!) సడెన్‌గా ఉప్పెన లాగా వచ్చి రేడియో ఆపేసి 'నాతో మాట్లాడండి' అంది కోపంగా. ఆశ్చర్యం నుంచి తేరుకుని మళ్ళీ రేడియో ఆన్ చేశారుట. (అది వేరేసంగతి!) కష్టపడి అలసి పోయి వచ్చాక కాస్సేపు హాయిగా రేడియో తిప్పుకోకుండా ఏం మాట్లాడాలి? (రేడియో వినడానికెలాగా పాతప్రోగ్రాము లేగా? అంచేతే అలా అలా ప్రపంచం అంతా తిప్పి సంతోషించడం)... 'ఏడుస్తూ వెళ్ళి అలక పాన్పెక్కింది. మా సంగతి నీకు తెలుసుకదా! ఇద్దరం పొరపొచ్చాలు లేకుండా హాయిగా కాలం గడిపాం ఇంత కాలం. ఒకరి ఊహలని ఒకరు చదివేయ కలం— గడగడా. అలాంటిది ఇప్పుడిదేమిటంట? ఈ ధోరణికి అర్థం ఊహించ కలనా?' అంటూ నిలదీశారు.

నాకు నవ్వొచ్చింది — ఒకరి నొకరం గడగడ చదివేయగలం అంటే. మేష్టారి నమ్మకం అది! నా ఉద్దేశ్యంవేరు—అయినే కనుక అలా ఆమె ఊహలుకూడా చదవ గలిగిఉంటే — ఇంతిగా భార్యగారు మాట కోసం మొహంవాచి పోతారా? ఆయన కంటే నాకే ఆవిడ ఊహలు గ్రహించేశక్తి ఉందేమో—పాపం—రోజంతా చాకిరితో సతమతమై సాయంత్రం భర్తరాకకోసం ఎంతో ఆశగా ఎదురుచూసే ఆమెకి ఎదురయ్యే దేమిటి? ఏదో పిచ్చాపాటీ కబుర్లు, ఓపిక ఉంటే మెదడుకు మేతవేసే విషయాల చర్చలు— అబ్బే అవేం లేదు! రేడియో బర్‌బర్‌లు! నిజమే అలసిన ఆయనగారికి విశ్రాంతి కావాలి. ఆమెకీ కావాలి. ఆమె

పేది కబుర్లని ఉత్సాహంతో వినలేక పోవచ్చు. కాని ఒక్క సంగతి జ్ఞాపకం ఉంచుకోవాలి — గృహిణి జీవితం చాలా రొటీనుగా చప్పగా తయారై కనీసం విస్తృతమైన పరిధులుకూడా లేని విసుగు జనింప చేసేదిగా ఉంటుంది. రోజూ ఒకటే పనికదా. అందుకే బర్ బర్‌లని కొంచెం బలిపెట్టి అదీ ఇదీ కొంచెం కబుర్లు చెప్తే ఏం పోయింది? అని అడగాలని పించింది. అప్పుడాయన చెంగ పడుతున్న ఈ వింత ధోరణి మటుమాయం కావచ్చు. మా మామయ్య ఉన్నాడు ఇలాంటి చిన్ని విషయాలలో మహా తెలివితేటలు ఉపయోగిస్తాడు. వస్తూనే 'సీతా రోస్' అంటూ ప్రేమతో పలకరించేసి 'ఏంచేసావే దీనుడికి' అంటూ ప్రాధేయపడే సరికి అత్తయ్య అయిసయిపోయి — తిన్నగా వంటింట్లోకి వెళ్ళిపోయింది — మామయ్య హాయిగా పేక తీస్తాడు! — అలా వుండాలి తెలివంటె — ఒకే దెబ్బకి రెండుపిట్టలు అన్నట్టు — అటు అత్తయ్య సంతోషంతో — రాదర్, తన్మయంతో ఉప్మా కలియ బెడ్తూ వుంటే ఇక్కడ ఓగంట పేషంట్సు ఆడుతాడు మామయ్య. ఇంతమంది విద్యార్థులని క్రమశిక్షణలో పెట్టే మాష్టారికిలాంటి చిట్కాలెందుకు తోచలేదు? అని ఆశ్చర్యం వేసిందిగాని — ఊరుకున్నాను.

మెకానికల్‌గా కాఫీగ్లాసు అందుకుంటూ కూడా ఊరంత డైలాగు దొర్లించినంత నేర్పు ప్రదర్శిస్తారు కొందరు భర్తలు. కొందరు బెల్లంకొట్టిన రాళ్ళలాగా ముఖం చిట్లించుకుని అందుకుంటారు — మనుషుల్లో ఎన్నో రకాలు — వాటిలో ఇవి కొన్ని — ఇంట్లో — ప్రేమమాటలు, కోపంమాటలు — పోనీ అసలు మాటలులేని మాటలు — అన్నిటిదీ ఒకటే ధ్యేయం — ఉనికిని గుర్తించమని అపేక్షించడానికే. కమ్యూనికేషన్‌కే. అదే లేకుంటే... కొంపలు కొంపల్లా ఉండవు — అంతమాత్రాన ఇంట్లో పలుకే బంగారం కానక్కరలేదు — రాళ్ళవాన వెలసినట్టూ కానక్కరలేదు — ఏమంటారు? ●






దక్షిణామెరికాలో నుండే వింత సస్యజీవి ఇది. శరీరాన్ని తల కిందుగా ఉంచి, 2 జతల కాళ్ళని కొక్కేలుగా ఉపయోగిస్తూ, నెమ్మదిగా కొమ్మలమీద పోవడం దీని ప్రత్యేకత — మామూలుగా జంతువులకు భూమి కనబడుతూంటే, దీనికి ఆకాశం కనబడుతూంటుందన్నమాట. సాధారణంగా నేలమీదకిరావు. నేలమీద ఉంచితే వీటిఅవస్థ చెప్పుకో వలసిందే కొద్దిగానైనా ముందుకు సాగడం కష్టం అయిపోతుంది.

ముందు, వెనుక కాళ్ళకు మూడేసి (ముందుకాళ్ళకు కొన్నిటిలో రెండే) వేళ్ళు కొక్కేలుగా నున్నవి ఉంటాయి. అవి పట్టువదలి కిందకు జారడం, అసంభవం అన్నమాట. వీలయితే అప్పుడప్పుడు క్రిందనున్న కొమ్మలకు ఆన్తాయి.

చర్మంమీద వెంట్రుకలు చాలా అసహ్యంగా ఉంటాయి. కొన్నిటికి వెంట్రుకల్లో పచ్చని 'ఆల్గే' వృక్ష జాతి ఉండడంచేత, చెట్లలో శత్రువుల కంట పడకుండా కొంత తప్పించుకోగల్గుతాయి. వర్షాలకు మీదపడే నీళ్ళు నిలిచి పోకుండా, క్రిందకు జారడానికి వీలుగా ఉంటాయి ఈ వెంట్రుకలు. తల చిన్నదిగా ఉంటుంది. చెవులు చిన్నవి. తోకశూన్యం.

పగలంతా విశ్రాంతి తీసుకొని రాత్రికాలంలో తమ శాఖాహారాన్ని తింటాయి. శరీరానికి కావలసిన నీటిని, ఆకులనుంచే గ్రహిస్తాయి.

సుమారు లక్ష సంవత్సరాల క్రింద, నేలమీదనే కొన్ని స్లాత్‌లు నివసిస్తూండేవి. మెగాతీరియం, మైలోడాన్ లాటివి అవి. సుమారుగా 20 అడుగుల ఎత్తున ఉండేవి ఇవి. పెద్ద పెద్ద చెట్ల కొమ్మలను సహితం నేలమీద నుంచే అందుకొనేవి సునాయాసంగా.

— జమ్మి కోనేటిరావు